క్లుప్తంగా

అప్రమత్తంగా ఉండాలి

నర్సంపేట : మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. అత్యవసరం అయితే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని సూచించారు. విద్యుత్ స్తంభాలను తాకొద్దని, చెట్ల కింద, శిథిలమైన భవనాల నీడన, లోతట్టు ప్రాంతాల్లో ఉండకూడదని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో అధికారులకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. ఆపత్కాలంలో అధికారులు తక్షణమే సహాయక చర్యలు తీసుకుంటారని తెలిపారు.

కరాటే పోటీలో విద్యార్థుల ప్రతిభ



నర్సంపేట : కాజీపేటలో నాగ మహేశ్ శీతోఖాన్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీలో నర్సంపేట శీతోకాన్ జపాన్ కరాటే దు ఇండియా హంబు సంస్థ విద్యార్థులు ప్రతిభ చాటి పతకాలు సాధించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ రాష్ట్ర టెక్నికల్ డైరెక్టర్ షిహన్ రచ్చ భవానీ చంద్ విలేకరులకు వివరాలు వెల్లడించారు. తొమ్మిదేళ్ల బాలికల విభాగంలో తపస్వి బంగారు, పదేళ్ల విభాగంలో అభిజ్ఞ వెండి, ఏడేళ్ల బాలుర విభాగంలో మనీశ్ బంగారు, పదేళ్ల శివప్రసాద్ బంగారు, 12 ఏళ్ల విభాగంలో గురు చరణ్ బంగారు, 13 ఏళ్ల విభాగంలో రాంచరణ్ బంగారు, తొమ్మిదేళ్ల సుధాంశ్ వెండి పతకాలు సాధించారని చెప్పారు. పతకాలు సాధించిన వారిని సంస్థ ఇండియా చీఫ్ ఇన్‌స్పెక్టర్ శ్రీహన్ రచ్చ శ్రీనుబాబు అభినందించారు.

మద్యం స్వాధీనం

పర్వతగిరి : మండలంలోని ముంజాలకుంట తండాలోని ఓ కిరాణా షాపులో అక్రమంగా నిల్వ చేసిన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్సై ఎల్.రవీందర్‌రెడ్డి తెలిపారు. వివరాలిలా.. కిరాణా షాపులో అక్రమంగా మద్యం అమ్ముతున్నారని సమాచారం అందడంతో ముంజాలకుంటతండాలో పోలీసు సిబ్బంది రమేశ్, రాజులతో కలిసి ఏఎస్సై రవీందర్‌రెడ్డి బాదావత్ కౌసల్యకు చెందిన షాపుపై దాడి చేశారు. పోలీసులను చూసి కౌసల్య పారిపోతుండగా అదుపులోకి తీసుకుని రూ.7,780 విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నారు. కౌసల్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

బస్సు-కారు ఢీ

పర్వతగిరి : మండలంలోని కల్లెడలోని ఆకేరు వాగు బ్రిడ్జి వద్ద అన్నారం షరీఫ్ నుంచి వరంగల్ దిశగా ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సు పర్వతగిరి నుంచి అన్నారం వైపు వెళ్తున్న కారు ఒకదానిని మరొకటి ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఎయిర్ బ్యాగ్స్ తెరుచుకోవడంతో ఎవరికీ ప్రమాదం వాటిల్లలేదని స్థానికులు తెలిపారు. ఎస్సై ప్రవీణ్‌ను వివరణ కోరగా ఫిర్యాదు అందలేదని చెప్పారు.

పరామర్శ

నర్సంపేట : పట్టణానికి చెందిన న్యాయవాది, బీఆర్ఎస్ నాయకుడు గూళ్ల అశోక్‌కుమార్ గతేడాది మృతి చెందగా ఆయన కుటుంబాన్ని నియోజకవర్గ నాయకుడు డాక్టర్ లెక్కల విద్యాసాగర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు సత్యనారాయణ ఆదివారం పరామర్శించారు. తొలుత అశోక్ కుమార్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి నర్సింహరాములు, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యువరాజు, న్యాయవాదులు మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

రోళ్లకల్‌లో..

పర్వతగిరి : మండలంలోని రోళ్లకల్‌కు చెందిన బైరి శాంతమ్మ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని అభ్యుదయ రచయితల సంఘం (అరసం) రాష్ట్ర అధ్యక్షుడు వీరస్వామి, గోపా వరంగల్ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మీనారాయణ, డీటీఎఫ్ కార్యదర్శి మాంకాలి రామస్వామి ఆదివారం పరామర్శించారు. తొలుత శాంతమ్మ చిత్రపటానికి వీరస్వామి, లక్ష్మీనారాయణ, రామస్వామి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు.

నివాళి

పర్వతగిరి : మండల కేంద్రానికి చెందిన పిన్నింటి దశరథ రామారావు (65) శనివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందగా ఆయన మృతదేహానికి తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు ఆదివారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

చోరీ

గీసుకొండ : మండలంలోని మరియపురం సమీపంలోని ఎస్ఎస్ గార్డెన్‌లో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి జన్మదిన వేడుకలో జేబు దొంగలు చేతివాటం ప్రదర్శించారు. కొమ్మాలకు చెందిన నాయకుడు బోగి శ్రీనివాస్ జేబు నుంచి రూ.15 వేల నగదు తస్కరించారని నాయకులు తెలిపారు. అలాగే పలువురు జేబుల్లోని నగదు కాజేసినట్లు తెలిసింది. సీసీ కెమెరాలను పరిశీలించినా ఆధారాలు లభించలేదని నాయకులు తెలిపారు.

దుగ్గొండి : మత్తడిపోస్తున్న దుగ్గొండి చెరువు



నల్లబెల్లి : అలుగుపోస్తున్న రంగాయ చెరువు



నర్సంపేట : ఎన్‌టీఆర్ నగర్‌లో పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్, తదితరులు



జనజీవనం అతలాకుతలం

జిల్లాలోని నర్సంపేట, నల్లబెల్లి, చెన్నారావుపేట, దుగ్గొండి, ఖానాపురం, వర్ధన్నపేట, రాయపర్తి, పర్వతగిరి, గీసుకొండ, సంగెం, తదితర మండలాల్లో ఆదివారం కొనసాగిన వర్షానికి జనజీవనం అతలాకుతలం అయింది. పలు చెరువులు మత్తళ్లు పోస్తుండగా నర్సంపేట–వరంగల్, తదితర ప్రదేశాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. కొన్ని చోట్ల విద్యుత్ సరఫరా నిలిచిపోగా అధికారులు, సిబ్బంది శ్రమించి మరమ్మతు చేశారు. నర్సంపేటలోని పలు ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. తహసీల్దార్ కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్లు, ప్రధాన కూడళ్లు జలమయం అయ్యాయి.

-సాక్షి నెట్‌వర్క్



సంగెం : మత్తడి పోస్తున్న సంగెం చెరువు



పర్వతగిరి : పోలుకమ్మ చెరువు కాల్వలో ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు



చెన్నారావుపేట : మత్తడి పోస్తున్న మగ్దుంపురం చెరువు



నర్సంపేట : నీటిని జేసీబీతో తొలగిస్తున్న మునిసిపల్ సిబ్బంది



నర్సంపేట రూరల్ : గురిజాల-నర్సంపేట రోడ్డులో నీటి ఉధృతి



గీసుకొండ : పోతరాజుపల్లి-బొడ్డచింతలపల్లి దారిలో కాజ్‌వేపై ఉధృతి



చెన్నారావుపేట : విద్యుత్ సరఫరా పనుల్లో అధికారులు, సిబ్బంది



నర్సంపేట : వరంగల్-ములుగు జిల్లాల సరిహద్దు అశోక్‌నగర్ గ్రామ సమీపంలో..



దుగ్గొండి : మండల కేంద్రంలో పత్తి పంటలో నిలిచిన నీరు



నెక్కొండ : అలుగు పోస్తున్న నెక్కొండ చెరువు



రాయపర్తి : గాయపడిన వారిని 108 అంబులెన్స్ ఎక్కించేందుకు మత్తడి దాటిస్తున్న గ్రామస్తులు



చెన్నారావుపేట : పాపయ్యపేట ఊర చెరువుకు పడిన గండి పూడ్చుతున్న రైతులు



ఖానాపురం : ఉధృతంగా ప్రవహిస్తున్న పాకాల వాగు



రాయపర్తి : మత్తడిపోస్తున్న పెర్కవేడులోని దేవునిచెరువు

రంగాయ చెరువు రీడిజైన్‌తో నష్టం

- ఎమ్మెల్యే దిష్టిబొమ్మలతో శవయాత్ర, దహనం

నల్లబెల్లి : రంగాయచెరువు రీడిజైన్ చేస్తే రైతులకు నష్టం వాటిల్లుతుందని మండలంలోని కొండాపూర్, మూడుచెక్కలపల్లి, ఎర్రచెరువుతండా గ్రామాలకు చెందిన గిరిజన రైతులు వాపోయారు. మండలంలోని మూడుచెక్కలపల్లి, కొండాపూర్ గ్రామాల్లో గిరిజన రైతులు ఆదివారం నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి దిష్టిబొమ్మలతో శవయాత్ర నిర్వహించి దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గిరిజన రైతులు మాట్లాడారు. ఎమ్మెల్యే మాధవరెడ్డి ఆలోచన మేరకు టీఎంసీ సామర్థ్యంతో రంగాయచెరువు రిజర్వాయర్‌కు నిర్మాణ పనులు చేపడితే మూడుచెక్కలపల్లి, గోవిందాపూర్, లక్ష్మితండా, ఆసరవెల్లి, లైన్‌తండా, కొండాపూర్ గ్రామాలకు ముంపునకు గురై ఖాళీ చేయాల్సిన దుస్థితి నెలకొంటుందని ఆందోళన వెలిబుచ్చారు. రీడిజైన్ ఆలోచన మానుకోవాలని హితవు పలికారు.



దిష్టిబొమ్మను శవయాత్రకు సిద్ధం చేస్తున్న రైతులు

కేసు నమోదు

ములుగు జిల్లా ఏటూర్‌నాగారంలో ఇటీవల జరిగిన సమీక్ష సమావేశంలో దేవాదుల ప్రాజెక్టుపై ఎమ్మెల్యే మాధవరెడ్డి మాట్లాడిన మాటలను వక్రీకరించి ఆసరవెల్లిలో ఎమ్మెల్యే దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించి దహనం చేసిన పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రశాంత్ బాబు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మితండా, రాంపూర్, ఆసరవెల్లి గ్రామాలకు చెందిన లావుడ్యా తిరుపతి, గాదం రాజ్ కుమార్, గుండెబోయిన సాంబయ్య, అజ్మీర బాసు, పనికర రాజు, బాదవత్ బాలు, రాజబోయిన ప్రవీణ్‌లు సోషల్ మీడియాలో ఎమ్మెల్యే మాధవరెడ్డిని వ్యక్తిగతంగా తీవ్రంగా పరుష పదజాలంతో దూషిస్తూ తప్పుడు ప్రచారం చేశారని బిల్ నాయక్ తండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ మండల మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాలోత్ చరణ్ సింగ్ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్



గీసుకొండ: ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడిగా దుబ్బ శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈ మేరకు కీర్తినగర్‌లోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయ ఆవరణలో ఆదివారం ఎన్నికలను నిర్వహించారు. ఈ ఎన్నికల కార్యక్రమానికి మహాసభ రాష్ట్ర కార్యదర్శి వంగేటి అశోక్, జిల్లా అధ్యక్షుడు దుబ్బ శ్రీనివాస్, ఇరుకుల్ల రామకృష్ణ, గంప శ్రీనివాస్, గంద శ్రీనివాస్ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికైన శ్రీనివాస్‌ను అభినందించారు.

వైద్యశిబిరాలు నిర్వహించాలి

దుగ్గొండి : వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ డిమాండ్ చేశారు. మండలంలోని గిర్నిబావిలో ఆదివారం నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. పాలకులు ముందస్తు ప్రణాళికలు లేకుండా ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సమయాల్లో కార్యక్రమాలు చేపడుతూ ప్రజాధనాన్ని దోచుకుంటున్నారని తెలిపారు. పేదలకు వైద్య, ఇతర సేవలు అందించడానికి కార్యకర్తలు ముందుండాలని చెప్పారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కుమారస్వామి, బాబురావు, కొమురయ్య, మల్లికార్జున్, రాజా సాహెబ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

లోలెవల్ కాజ్‌వేపై వంతెన నిర్మిస్తాం

చెన్నారావుపేట: చెన్నారావుపేట శివారులోని లో లెవల్ కాజ్‌వేపై వంతెన నిర్మిస్తామని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు చెరువులు, కుంటలు అలుగుపోస్తుండటంతో చెన్నారావుపేట-నర్సంపేట మధ్యలోని లో లెవల్ కాజ్‌వేపై నుంచి ఉధృతంగా నీరు ప్రవహిస్తుంది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదివారం కాజ్‌వేను సందర్శించి గంగమ్మ తల్లికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా వంతెన నిర్మాణానికి కృషి చేయడమే కాకుండా నిర్మించి తీరుతామన్నారు. ఆయన వెంట ఆర్డీఓ కృష్ణవేణి, ఎస్సై గూడ అరుణ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్ నాయక్, మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి, రమేష్, కర్ణాకర్, శ్రీను, కుమారస్వామి, వీరయ్య, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

బస్సు సౌకర్యం కల్పించాలి

పర్వతగిరి : మండలంలోని రావూరు గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ ఆ గ్రామ ప్రజలు ఆదివారం ధర్నా చేశారు. రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్న క్రమంలో కల్లెడ పాత బ్రిడ్జి మీదుగా వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో అధికారులు బస్సులను రావూరు మీదుగా దారి మళ్లించి నడిపిస్తున్నారు. ఈ క్రమంలో గ్రామం మీదుగా ప్రయాణిస్తున్న హన్మకొండ డిపో బస్సును గ్రామస్తులు ఆదివారం అడ్డుకుని ధర్నా చేశారు. ప్రతిరోజూ గ్రామం మీదుగా బస్సు నడపాలని డిమాండ్ చేశారు. గత ఏడేళ్లుగా డిపో మేనేజర్‌ను, అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదని ఆందోళన వెలిబుచ్చారు. సమాచారం తెలిసి సీఐ రాజగోపాల్ అక్కడకు చేరుకుని గ్రామస్తులతో మాట్లాడారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార దిశగా చొరవ తీసుకుంటామని భరోసా ఇచ్చి ధర్నా విరమింపజేశారు.



బస్సును అడ్డుకుని ధర్నా చేస్తున్న గ్రామస్తులు

ఘనంగా ఎమ్మెల్యే రేవూరి జన్మదిన వేడుకలు



జన్మదిన వేడుకలో కాంగ్రెస్ నాయకులు

గీసుకొండ : మండలంలోని మరియపురం సమీపంలోని ఎస్ఎస్ గార్డెన్‌లో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి 71వ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కేక్ కట్ చేసి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డికి మంత్రి పదవి రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సౌజన్య, పరకాల నియోజకవర్గ అధికార ప్రతినిధి కొమురారెడ్డి, నాయకులు రాజ్‌కుమార్, బాలికిషోర్‌రెడ్డి, రుద్రప్రసాద్, రమేశ్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న గోదాసి చిన్న

రక్తదానం

ధర్మారానికి చెందిన నాయకులు గోదాసి చిన్న, వీరేశం అధ్వర్యంలో ఆయన రేవూరి టీం నాయకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో జన్ను రాజు, బొల్లం రాంకుమార్, గడ్డం విష్ణు, జావాజీ సురేశ్, కొమ్ముల భరత్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు మళ్లించొద్దు

వర్ధన్నపేట : ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను ఇతర శాఖలకు మళ్లించొద్దని దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం (డీఎస్ఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం సబ్‌ప్లాన్ నిధులను రోడ్లు, భవనాల, ఇతర శాఖలకు మళ్లించిందని గుర్తు చేశారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను దళితుల, గిరిజనుల అభివృద్ధికే వినియోగించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో దళితుల, గిరిజనుల అభివృద్ధికి తగిన రీతిలో నిధులు కేటాయించాలని, కులాంతర వివాహితులకు అందిస్తున్న ప్రోత్సాహకాన్ని రూ.5 లక్షలకు పెంచడంతోపాటు ఎస్సీ స్టడీ సర్కిళ్లు ఏర్పాటు చేయాలని, దళితులకు విదేశీ విద్య కోసం అందించే ఆర్థిక తోడ్పాటును రూ.40 లక్షలకు పెంచాలని కోరారు. సమావేశంలో నాయకులు కంజర్ల సమ్మయ్య, చల్లా మిధున్, మునిగాల అరుణ్, కుమార్, క్రాంతి, మురళి, రాంచంద్రు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ రూరల్ :
9951602875 9553955722
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
డి. రాజు యాదవ్ (S.R) : 9502950309 (వర్ధన్నపేట
ఎం. మురారి (S.R) : 9502950309 (నర్సంపేట)
పి.చంద్రశేఖర్ (A.C.O) : 9963646944